సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం ၊ 17 ၊ నవంబర్ ၊ 2024



కిలో టమాట రూ.23

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.13 ప్రకారం ధర పలికింది.



యువతి దుర్మరణం

మరికొన్ని గంటల్లో వివాహ నిశ్చితార్థం జరగాల్సిన యువతి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఇదే ప్రమాదంలో సోదరుడు గాయపడ్డాడు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం

32.1°/19.4°

జిల్లా పరిధిలో శనివారం తుపాను వాతావరణం నెలకొంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వైద్య సేవలపై ఆరా



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

రొద్దం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ మంజువాణి శనివారం రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది పనితీరుపై డాక్టర్ భాగ్యలక్ష్మితో ఆరాతీశారు. ఐఎల్‌ఆర్ వ్యాక్సిన్లు పరిశీలించారు. అక్కడే ఉన్న రోగులతో వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని హెచ్‌ఎం గిరీష్ స్వామికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల వైద్య పరీక్షలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గిరినాథ్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి టౌన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ సాధికార సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ సాధికారిత జిల్లా అధికారి నిర్మాలాజ్యోతి తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పది, ఇంటర్ డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి జిల్లా సాంఘిక సాధికారిత కార్యాలయంలో నవంబర్ 24లోపు అందజేయాలని కోరారు. వార్షికాదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. నవంబర్ 27న స్క్రీనింగ్ నిర్వహించి, మెరిట్ ఆధారంగా బీసీలకు 66, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్ చొప్పున అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 93921 41545 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అప్పు తెచ్చిన తంటా

- తోపులాటలో వేడినీరు పడి చిన్నారికి తీవ్రగాయాలు



పరిగి: అప్పు కోసం జరిగిన తోపులాటలో ప్రమాదవశాత్తూ వేడినీరు పడి ఓ చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని బిందూనగర్‌లో శ్రీకన్య, సుబ్రహ్మణ్యం దంపతులు హోటల్ నిర్వహిస్తున్నారు. వీరు సాయి అనే వ్యక్తి వద్ద బియ్యం కొనుగోలు చేశారు. చాలా రోజులైనా బియ్యం డబ్బు చెల్లించకపోవడంతో సాయి శనివారం ఉదయం హోటల్ వద్దకు వచ్చాడు. అతడికి హోటల్ నిర్వాహకులకు మధ్య మాటామాటా పెరిగి తోసుకున్నారు. ఈ క్రమంలో అన్నం కోసం పాత్రలో పెట్టిన ఎసరు (వేడినీరు) అక్కడే ఉన్న సుబ్రహ్మణ్యం నాలుగేళ్ల కూతురు ప్రణవిపై ఎగిరి పడడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే చిన్నారిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి బెంగళూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



చిదిమేస్తున్నారు!

మనుషుల్లో మార్పు రావడం లేదు. మహిళల గురించి.. అమ్మ గురించి, అమ్మాయిల గురించి సినిమాల్లో హీరోలు ఉపన్యాసాలు ఇస్తే చూసి ఆనందిస్తారు. కానీ ఆచరణలో మాత్రం పాటించడం లేదు. సమాజంలో మహిళలకు రక్షణ కరువైంది. పుట్టబోయే బిడ్డ ఆడ అని తెలిస్తే భూమి మీదకు రాకముందే చిదిమేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ చేస్తూ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు జేబులు నింపుకొంటున్నారు.

» **హిం**దూపురానికి చెందిన మహిళ రెండోసారి గర్భం దాల్చి.. ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లి స్కానింగ్ చేయించుకుంది. మొదటిసారి ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఈమె ఇప్పుడు రెండో కాన్పులో కూడా ఆడబిడ్డే పుడుతుందని స్కానింగ్‌లో తేలడంతో అబార్షన్ చేయించుకుంది. అప్పటికే ఆరు నెలలు నిండి ఉండటంతో సదరు మహిళ ఆరోగ్యం దెబ్బతింది. తర్వాత 10 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందింది.

» **ధ**ర్మవరానికి చెందిన 23 ఏళ్ల మహిళ గర్భం దాల్చింది. సరైన పోష్టకాహారం తినకపోవడంతో ఆరోగ్యం సరిలేక ఆస్పత్రిలో చేరింది. రెండు నెలల అనంతరం ఆరోగ్యం కుదుటపడ్డాక.. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంది. ఆడబిడ్డ అని తేలడంతో ఎందుకని వేరే ఊరెళ్లి అబార్షన్ చేయించుకుంది. అనారోగ్యం తిరగబడింది. ఉన్నఫలంగా బెంగళూరు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రతిచోటా ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. కొందరు కోలుకున్నా.. ఇంకొందరు అనారోగ్యం బారిన పడుతున్నారు. మరికొందరు భ్రూణ హత్యలను ప్రేరేపిస్తున్నారు. నేరమని తెలిసినా.. విద్యావంతులు కూడా భ్రూణహత్యలకు పాల్పడుతుండటం బాధాకరం.

ఆడపిల్లని తెలిస్తే అబార్షనే

- యథేచ్ఛగా భ్రూణ హత్యలు
- లింగ నిష్పత్తిలో భారీ వ్యత్యాసం
- గుట్టుచప్పుడు కాకుండా నిర్ధారణ

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో భ్రూణహత్యలు (గర్భంలోనే శిశువును చంపేయడం) ఆందోళన కలిగిస్తున్నాయి. కడుపులో పడింది ఆడపిల్ల అని తెలిస్తే చాలు కొందరు తల్లిదండ్రులు కర్కశంగా వ్యవహరిస్తున్నారు. తొలి సంతానంలో ఆడబిడ్డ పుడితే రెండోసారి గర్భం దాల్చిన మహిళలు 98 శాతం స్కానింగ్ చేయిస్తున్నారు. ఆడపిల్ల అని తెలిస్తే గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్ చేయిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ప్రతి గ్రామంలోనూ బయటపడుతున్నాయి. కొందరు నెలలు గడిచిన తర్వాత అబార్షన్ చేయించుకుని అనారోగ్యం బారిన పడుతున్నారు. పుట్టబోయే బిడ్డను చంపితే తల్లికి కూడా ప్రమాదమే అని సంగతి మరిచిపోతున్నారు. లింగనిష్పత్తిలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 971 మంది అమ్మాయిలు ఉన్నారు. లింగనిష్పత్తిలో అంతరం భవిష్యత్‌లో ఇబ్బందికరంగా మారే అవకాశం లేకపోలేదు.

మగ సంతానం కోసమే..

లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ సెంటర్లకు వెళ్లే మహిళల్లో 40 ఏళ్లు పైబడిన వారు కూడా ఉంటున్నారు. మగ సంతానం కోసం పదేపదే అబార్షన్లు చేయించుకుని ఆలస్యం అవుతున్నట్లు సమాధానం చెబుతున్నారు. ఇద్దరు అమ్మాయిలు పుడితే చాలని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారు సైతం తర్వాత రీ-ఆపరేషన్ చేయించుకుని గర్భం దాలుస్తున్నారు. మగ సంతానం కోసం లేటు వయసులో పిల్లలను కంటున్నారు.

కోడ్ భాషలోనే..

స్కానింగ్ సెంటర్లలో పుట్టబోయేది ఆడ, మగ అనే లింగ నిర్ధారణకు కోడ్ భాష వాడుతూ అబార్షన్‌లు చేస్తున్నారు. ఆడబిడ్డ అయితే '9' అని చెబుతారు. మగబిడ్డ '6' అని నంబరు చూపిస్తారు. 6 అంటే ఇంగ్లిష్ ఆల్ఫాబెట్ చిన్న అక్షరాల్లో బి (బాయ్) అని అర్థం. అదేవిధంగా 9 అంటే ఆల్ఫాబెట్ చిన్న అక్షరాల్లో జీ (గర్ల్) అని ముందుగానే గర్భిణులకు తెలియజేస్తారు. అనంతరం 'క్యాన్సిల్ ఆర్ క్యారీ' అనే పదాలను వినియోగిస్తూ ముందుగానే డబ్బులు తీసేసుకుని అబార్షన్ తంతు సాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా భ్రూణ హత్యలు గుట్టుచప్పుడుగా సాగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

జిల్లా గణాంకాలు

లింగ నిష్పత్తి - 1000 : 971

ప్రైవేటు ల్యాబ్‌లు - 68

స్కానింగ్ కేంద్రాలు - 66





చాలా ప్రమాదకరం

లింగ నిర్ధారణ నేరం. ఎక్కడైనా చేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. భ్రూణ హత్యలు సరికాదు. మహిళలు లేనిదే ప్రపంచం లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. అబార్షన్ చేయించుకునే మహిళ కూడా మొదట అమ్మాయిగానే పుట్టిందనే విషయాన్ని గమనించాలి. అబార్షన్ అనేది ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. **– డాక్టర్ మంజువాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి**

29 మండలాల్లో వర్షం



గోరంట్ల మండలం గంగంపల్లి వద్ద నేలకొరిగిన వరి పంట

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు 29 మండలాల్లో వర్షం కురిసింది. 12 మండలాల్లో మోస్తరు వర్షం కురవగా తక్కిన మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. ఇందులో నల్లచెరువు మండలంలో 28.4 మి.మీ, గాండ్లపెంట 27.4, పెనుకొండ 24.8, కదిరి 24.2, మడకశిర 22.2, ఓడీచెరువు 21.4, నల్లమాడ 18.6, ఎన్‌పీకుంట 17, రొళ్ల 16.2, గోరంట్ల 16.2, కనగానపల్లి 11.8, సోమందేపల్లి 10.6 వర్షం కురిసింది. ఇక రొద్దంలో 9.2, అగళి 8.4, రామగిరి 6.8, గుడిబండ 6.6, బుక్కపట్నం 6.4, పుట్టపర్తి 6.2, లేపాక్షి 6.2, తలుపులలో 5.2, అమరాపురంలో 4.8, తనకల్లు 4.8, అమడగూరు 4.6, సీకేపల్లి 3.2, హిందూపురం 3.2, పరిగి 3, చిలమత్తూరు 2.6, ధర్మవరంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెప్పారు.

నేలకొరిగిన వరి పంట

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలకు గాలి తోడు కావడంతో కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ముఖ్యంగా తనకల్లు, అమడగూరు, ధర్మవరం, పుట్టపర్తి గోరంట్ల మండలాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లింది. పూర్తి సమాచారం అంచనా వేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు చెప్పారు.

చిన్నారులు ఎత్తుకు తగిన బరువుండాలి



అంగన్‌వాడీకేంద్రంలో పిల్లల ఎత్తు, బరువులు కొలుస్తున్న డాక్టర్ నివేదిత

పుట్టపర్తి అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకుంటున్న చిన్నారులు ఎత్తుకు తగిన బరువులు ఉండాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లిని సందర్శించిన ఆమె పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలకు దగ్గరుండి ఎత్తు, బరువులు కొలిచి నమోదు చేశారు. సగం మంది పిల్లలు తగిన బరువు, ఎత్తు లేకపోవడంతో తల్లిదండ్రులను పిలిపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల సంపూర్ణ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను విచారణ చేసి తగిన పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇందులో ముఖ్యంగా పుట్టుకలో లోపాలు, పౌష్టికార లోపాలు, చిన్నతనంలో వచ్చు వ్యాధులు, శారీరక మానసిక పెరుగుదల లేకపోవడం, వైకల్య లక్షణాలు గుర్తించి వైద్య చికిత్సలు అందించాలన్నారు. తల్లి పాల విశిష్టతను తెలియజేశారు. టీకాలు సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీ నారాయణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంపై కూటమి నేతల కన్ను

బత్తలపల్లి: సంజీవపురంలో ప్రభుత్వ భూమిపై కూటమి పార్టీల నేతల కన్ను పడింది. సచివాలయం వద్ద రోడ్డుకు ఆనుకుని ప్రభుత్వ ఆధీనంలో కొంత భూమి ఉంది. ఇది లక్షల రూపాయలు విలువ చేస్తుంది. ఇక్కడ స్థలాన్ని ఆక్రమించుకున్న కూటమి పార్టీ నేత ఇంటి నిర్మాణం కోసం చదును చేసి.. మార్కింగ్ వేశాడు. అంతటితో ఆగకుండా ఈ ప్రాంతంలో ఇంటి పట్టాలు ఇవ్వాలంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసింది. తాను ఆక్రమించిన స్థలాన్ని కలిపేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి గ్రామంలో ఇళ్లు లేని పేదలు పట్టాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి మరొక చోట కూడా అనువైన భూమి ఉంది. అయితే అక్కడ కాదని రోడ్డు పక్కన మంచి ధర పలికే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడంపై గ్రామస్తులు అవాక్కయ్యారు. ఈ విషయమై తహసీల్దార్ స్వర్ణలతను వివరణ కోరగా తామెవరికీ స్థలాలు, పట్టాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. సచివాలయానికి కావలసిన స్థలం వదిలేసి మిగిలిన స్థలంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టాలు ఇస్తామంటూ వివరణ ఇచ్చారు.



సచివాలయం ముందు స్థలం కబ్జా చేసి ఇంటి నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చిన దృశ్యం

సోషల్‌మీడియా యాక్టివిస్టులపై ఆగని కేసులు

హిందూపురం: సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు ఆగడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఫలితాల తర్వాత మాట్లాడుకుందామంటూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టాడు. వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేసే వారిని అణచివేసే క్రమంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ నిమిత్తం పోలీసులు శనివారం హిందూపురంలోని దండు రోడ్డులోని ఇంటికి వెళ్లి లోకేష్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, నాగరాజు, నాగమణి శనివారం రాత్రి స్టేషన్‌కు తరలివచ్చి లోకేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టినా ఏనాడూ ఎవరిపైనా కక్షసాధింపులకు దిగలేదని గుర్తు చేశారు. కూటమి పాలనలో భావప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసులు, విచారణ పేరుతో వేధిస్తే సహించేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక, నాయకులు వేణురెడ్డి ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో న్యాయవాది వెంకటరెడ్డి పూచికత్తుపై లోకేష్‌ను పోలీసులు వదిలిపెట్టారు.



స్టేషన్ నుంచి బయటకు వస్తున్న వాల్మీకి లోకేష్



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శైలజ

14న జాతీయ మెగా లోక్ అదాలత్

హిందూపురం: స్థానిక ఏడీజే కోర్టు ఆవరణలో డిసెంబర్ 14న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు అదనపు జిల్లా జడ్జి (ఏడీజే) కంపల్లె శైలజ తెలిపారు. శనివారం ఏడీజే కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌పై సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఏడీజే మాట్లాడుతూ సాధ్యమైన మేరకు ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా పోలీసులు, న్యాయవాదులు సహకరించాలన్నారు. న్యాయవాదులు రాజీమార్గం ద్వారా పరిష్కారమయ్యే కేసులను గుర్తించి లోక్ అదాలత్‌కు సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నూరప్ప, న్యాయవాదులు సుదర్శన్, సవేరా, భాగ్య, సీఐ జనార్దన్‌తోపాటు హిందూపురం డివిజన్, పరిగి ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- మినీ అంగన్‌వాడీలను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్



ధర్నా చేస్తున్న మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

పుట్టపర్తి టౌన్/ ప్రశాంతి నిలయం: ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీల అమలు కోసం మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు కదం తొక్కారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా గుర్తించాలని సీఐటీయూ కలెక్టరేట్ ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు కదిలారు. అయితే మామిళ్లకుంట క్రాస్, కర్ణాటకనాగేపల్లి వద్ద భారీగా పోలీసులు మోహరించి అడ్డుకునేందుకు ప్రయత్నించినా కార్యకర్తలు వివిధ మార్గాల ద్వారా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్, జీఎల్ నరసింహులు, ప్రధానకార్యదర్శి ఈఎస్ వెంకటేశులు మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీలు 42 రోజుల పాటు సమ్మె చేసినపుడు తాము అధికారంలోకి వస్తే మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా గుర్తిస్తామని కూటమి పార్టీల నేతలు హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలైనా హామీ అమలుపై ఎటువంటి జీఓ విడుదల చేయలేదన్నారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు వంటపని, రికార్డుల పని, బోధన పనులు, చిన్నారుల సంరక్షణలో ప్రధాన ప్రాత పోషిస్తున్నా తక్కువ వేతనంతో సరిపెడుతున్నారన్నారు. పైగా గ్రామాల్లో రాజకీయ వేధింపులతో పాటు విధుల నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ వర్కర్లుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మె మినిట్స్ కాపీని అమలు చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి మట్టి ఖర్చుల జీఓ అమలు చేయాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివ, లక్ష్మీనారాయణ, గంగాధర్, బాబావలి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శులు శ్రీదేవి, బీబీజాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం రవాణాపై నిఘా పెంచండి



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

చెన్నేకొత్తపల్లి: అక్రమ మద్యం రవాణాపై నిఘా పెంచాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల ఎక్సైజ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల మద్యం రాకుండా సిబ్బంది నిఘా పెంచాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు కాకుండా చూడాలని ఆదేశించారు. ఎంఆర్‌పీకే మద్యం విక్రయాలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని సీఐ ఫరూఖాజంకు సూచించారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, సిబ్బంది

హిందూపురం టౌన్: పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని మోడల్‌కాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి బైక్‌పై మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని 672 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఎస్ఐ ఫరూక్, హెడ్‌కానిస్టేబుళ్లు నరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సురేష్, సుధాకర్‌రెడ్డి, శివకుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉష్మాన్, విశాలాక్షి పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



ఇంద్ర (ఫైల్)

ఆత్మకూరు: వడ్డుపల్లిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన భగమంతు, ఈశ్వరమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు మీనుగ ఇంద్ర(21) విద్యుత్ కూలీ పనులు చేసేవాడు. ఇతడు ఏడాది నుంచి కడుపునొప్పితో బాధపడేవాడు. చికిత్స తీసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆదోని వాసి మృతి



మృతి చెందిన అనిల్‌కుమార్

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆదోని వాసి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం.. ఆదోనికి చెందిన అనిల్‌కుమార్(35) అవివాహితుడు. ఇంట్లో కుటుంబ సభ్యులు పనికి వెళ్లాలని చెప్పడంతో వారిపై అలిగి ఇంట్లో నుంచి వచ్చేశాడు. ఈక్రమంలో చేతిలో డబ్బు లేకపోవడంతో అనంతపురం నుంచి బత్తలపల్లికి నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం పొలం పనులకు వెళ్తున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అద్భుతం.. చెదిరిపోని జ్ఞాపకం



1904లో నిర్మించిన ఈ భవనంలో న్యాయస్థానాన్ని నిర్వహిస్తున్నారు



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంగా మారిన ఈ భవనాన్ని 1910లో నిర్మించారు



1920లో నిర్మించిన ఈ భవనంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు



1906లో పెనుకొండను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చి బ్రిటీష్ పాలకులు తమ కార్యకలాపాలను కొనసాగించింది ఈ భవనం నుంచే. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఈ భవనం రెవెన్యూ డివిజన్ కేంద్రంగానే ప్రజలకు ఎన్నో విశిష్ట సేవలను అందిస్తూ వస్తోంది.

జాతి ఉన్నంత కాలం చెదిరిపోని జ్ఞాపకాలవి. నిన్న... నేడు... రేపు... ఎప్పుడు... మరెప్పుడూ మరిచిపోలేని స్మారకాలు. శతాబ్దాల క్రితం నిర్మించిన కట్టడాలు నేటికీ పెనుకొండలో చెక్కు చెదర లేదు. నాటి బ్రిటీష్ పాలకులు తమ పాలనా సౌలభ్యం కోసం నిర్మించిన ఈ భవంతులు నాటి నుంచి నేటి వరకూ ప్రజలకు ఎన్నో విశిష్టమైన సేవలను అందిస్తున్నాయి. రాయి, గారను ఉపయోగించి 15 నుంచి 20 అడుగుల ఎత్తుతో కట్టిన సౌధాలు ఎంతటి వేసవిలోనైనా చల్లదనాన్ని పంచుతున్నాయి. వీటిలో ఏ భవనం గోడ తాకిన అభిమానాలను, అనుబంధాలను, ఆప్యాయతలను, ప్రేమను, సంతోషాన్ని, బాధను పంచుకోగలిగిన అనుభూతుల స్పందనలు కలగకమానవు. – పెనుకొండ:



1904లో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ కార్యాలయం



1907లో నిర్మించిన ఈ భవనం నేడు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలగా మారింది

చికిత్స పొందుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతుడు పోతలయ్య

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల..ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పోతలయ్య38)తమ ఇంటి ఇలవేల్పు కర్ణాటక సమీపంలోని బాదుపల్లి లింగమయ్యస్వామిని దర్శించుకునేందుకు ఈ నెల 13న బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా కర్ణాటకలోని తంబలచెరువు వద్ద డివైడర్‌ను ఢీ కొని తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కర్ణాటకలోని చిత్రదుర్గం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స ఫలించకపోవడంతో శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య మానసతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోతలయ్య మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి వీరాభిమానిగా గ్రామస్తులు చెప్పారు. పోతలయ్య మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, వాల్మీకి సంఘం రాయలసీమ ఇన్‌చార్జ్ సాంబ సంతాపం వ్యక్తం చేశారు.

సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్లు ప్రారంభం



పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకల ఏర్పాట్లు శనివారం ప్రారంభమయ్యాయి. సత్యసాయి భక్తులు విచ్చేసే రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తి వరకు పారిశుధ్య కార్యక్రమాలను డీ పీఓ సమత, డీఎల్‌పీఓ శివకుమారి ప్రారంభించారు. రెండు రోజుల్లోపు పనులన్నీ పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పనుల్లో నాణ్యత ఉండాలని, అందుబాటులో ఉన్న వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేయడం, డివైడర్ల మధ్య చెత్తాచెదారం తొలగించడం, చెట్లు కత్తిరించడం , విద్యుత్ దీపాలంకరణ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఇందిర బాల, సెక్రటరీలు ప్రభాకర్, గణేష్‌రెడ్డి, రాము, ప్రవీణ్, హరినాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- నిశ్చితార్థం ముందు రోజు ఘటన

తాడిపత్రి రూరల్: నిశ్చితార్థం కోసం గోరింటాకు పెట్టించుకుని సోదరునితో కలిసి ద్విచక్రవాహనంపై వస్తున్న యువతిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరెడ్డిపల్లికి చెందిన వీణాదేవి(24)కి ఆదివారం వివాహ నిశితార్థం జరగాల్సి ఉంది. ఇందు కోసం శనివారం సోదరుడు నారాయణరెడ్డితో కలిసి బైక్‌పై తాడిపత్రికి వెళ్లి చేతికి గోరింటాకు పెట్టించుకుంది. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా వీరి బైక్‌ను బుగ్గ నుంచి తాడిపత్రి వైపు వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో వీణాదేవి అక్కడికక్కడే చనిపోయింది. తీవ్రంగా గాయపడిన తమ్ముడు నారాయణరెడ్డికి తాడిపత్రిలో ప్రథమ చికిత్స చేసి, అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరికొన్ని గంటల్లో నిశితార్థం జరుగుతుందన్న అనందంలో ఉన్న వీణాదేవి ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను, గ్రామస్తులను కలచివేసింది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగాలు భర్తీ చేయాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యాకే ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శనివారం అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. సదస్సు ముఖ్య అతిథిగా విచ్చేసిన మంద కృష్ణ మాదిగను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా పోరాటం చేసిందని, ఈ పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి త్యాగ ఫలంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు రాజీవ్‌రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీని తాము స్వాగతిస్తున్నామన్నారు. వీలైనంత త్వరగా కమిటీ నివేదిక ఇచ్చి రెండు నెలల్లోపు వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించిన చంద్రబాబు, నరేంద్ర మోదీ, సుప్రీం కోర్టుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అంతకుముందు మాదిగలు నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

గొర్రెల కాపరిపై దాడి

గార్లదిన్నె: గొర్రెల మేపు విషయంలో ట్రాక్టర్ నగర్ సిబ్బంది గొర్రెల కాపరిపై దాడి చేశారు. బాధితుడి వివరాల మేరకు..శింగనమల మండలం వెస్ట్ నరసాపురానికి చెందిన గొర్రెల కాపరి నగేష్ ట్రాక్టర్ నగర్ సమీపంలోని దండకొండలో శనివారం గొర్రెలను మేపు కోసం తోలుకెళ్లాడు. నలుగురు ట్రాక్టర్ నగర్ సిబ్బంది అక్కడకు వచ్చి కొండలో గొర్రెలు మేపరాదని వాదనకు దిగడంతోపాటు అతడిపై కట్టెలతో దాడి చేశారు. తలకు గాయం కావడంతో వెంటనే అతడు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం 108 వాహనంలో అనంతపురం తరలించారు.

చంద్రగిరిలో వ్యక్తిపై హత్యాయత్నం

- పరిస్థితి విషమం



గాయపడిన కృష్ణమూర్తి శెట్టి

బొమ్మనహాళ్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో శనివారం రాత్రి ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కృష్ణమూర్తి శెట్టి చెల్లెలు పుష్పావతితో కలిసి ఉండేవాడు. రాత్రి ఆయన ఇంట్లో చెల్లెలితో కలిసి భోజనం చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వేటకొడవలితో చెయ్యి, వీపు, తలపై దాడి చేశాడు. తీవ్రగాయాల పాలైన అతడు అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించి చెల్లెలు భయంతో బయటకు వచ్చి కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేలోపు గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. కొన ఊపిరితో ఉన్న క్రిష్ణమూర్తి శెట్టిని 108లో బళ్లారి విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న బొమ్మనహాళ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా మండలంలోని కురువల్లికి చెందిన ఓ వ్యక్తితో భూమి తగాదాలతోనే ఈ హత్యాయత్నం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు.

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

- న్యాయ సంస్థలను కర్నూలులో కొనసాగించాలి
- జగన్ చెప్పిన విధంగా న్యాయరాజధాని ఏర్పాటు చేయాలి
- జల సాధన సమితి డిమాండ్



సుబ్బారావు విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న జలసాధన సమితి నాయకులు

హిందూపురం: శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. శ్రీబాగ్ ఒప్పందంలో సంతకం చేసిన హిందూపురం వాసి కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద శనివారం వారు నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తా కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలన్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేయాలన్నారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు తుంగభద్ర, కృష్ణా జలాలను కోస్తాతో సమానంగా రాయలసీమకు పంపిణీ చేయాలన్నారు. గత ప్రభుత్వం హంద్రీ–నీవా మెయిన్ కెనాల్‌ను 6300 క్యూసెక్కుల సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.6,182 కోట్లు బడ్జెట్‌కు పరిపాలన ఆమోదం తెలిపిందన్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం 3,850 క్యూసెక్కులకు మాత్రమే కాలువ వెడల్పు చేసేలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. హంద్రీ–నీవా కెనాల్ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెలకు పెంచడంతోపాటు మడకశిర బ్రాంచ్ కెనాల్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా మెయిన్ కెనాల్ నుంచి పిల్ల కాలువల ద్వారా 3.45 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వాలని కోరారు.

బడ్జెట్‌లో 46 శాతం కేటాయించాలి

ఏపీలో 46 శాతం భూభాగమున్న రాయలసీమకు సాగునీటి బడ్జెట్‌లో కేవలం 15 నుంచి 20 శాతం కేటాయిస్తున్నారని, కనీసం 46 కేటాయించాలని డిమాండ్ చేశారు. హంద్రీ–నీవా నీటితో హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గ చెరువులు నింపాలని కోరారు. జలసాధన సమితి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, రచయిత సడ్లపల్లి చిదంబరెడ్డి, జలసాధన సమితి నాయకులు అమ్మానుల్లా, జమీల్, చైతన్య తిప్పేస్వామి, కార్మిక నాయకులు రవి, దాసరి హరి, పర్యావరణ వేత్త భాస్కర్ రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ లోకేష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఓబుల్ రెడ్డి, గంగిరెడ్డి, రిటైర్డు టీచర్ ఓబులేష్ పాల్గొన్నారు.

మహిళా సెక్యూరిటీ గార్డుపై సూపర్‌వైజర్ దాడి



శ్యాండిల్ పరిశ్రమ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గోరంట్ల: బూదిలి సమీపంలో ఉన్న శ్యాండిల్స్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డు రాజేశ్వరిపై సూపర్‌వైజర్ త్రివేదిలాల్ విచక్షణా రహితంగా దాడి చేశాడు. బాధితురాలి వివరాల మేరకు.. రాజేశ్వరి మూడేళ్లుగా సెక్యూరిటీ గార్డు పని చేస్తోంది. తరచూ ఈమెను సూపర్‌వైజర్ త్రివేదిలాల్ విధి నిర్వహణ పేరుతో వేధించేవాడు. శుక్రవారం ఇదే విషయంలో ఆమెపై కంపెనీ మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై శనివారం ఉదయం ఆమె సూపర్‌వైజర్‌ను నిలదీసింది. మాటామాట పెరిగి ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నేతలు స్వర్ణలత, కొండ వెంకటేశులు అక్కడికి చేరుకుని సూపర్‌వైజర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. పరిశ్రమ హెచ్‌ఆర్ విభాగం వారు నిందితుడిని ఉద్యోగం నుంచి తొలగిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం వారు ఇదే విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదించగా బాధితురాలికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

రెండేళ్ల తర్వాత మృతదేహానికి రీపోస్ట్‌మార్టం

పెనుకొండ: ఓ వ్యక్తి మరణించిన రెండేళ్ల 4 నెలల తర్వాత రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ రమేష్ సమాచారం మేరకు.. పెనుకొండ నగర పంచాయతీలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన ఎంఆర్.శంకర్ (35) కియా సమీపంలోని ఓ హోటల్‌లో పని చేసేవాడు. 2022లో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. దీంతో మృతుని భార్య గౌరమ్మ తన భర్త మరణంపై అనుమానాలున్నాయని ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించడంతో రీపోస్ట్‌మార్టంకు ఎస్సీ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. శనివారం అనంతపురానికి చెందిన మెడికల్ కళాశాల ప్రొఫెసర్ శంకర్ తహసీల్దార్ శ్రీధర్, మడకశిర సీఐ రాజ్‌కుమార్, స్థానిక సిబ్బంది సమక్షంలో రీపోస్టుమార్టం చేశారు. ఇదిలా ఉండగా అప్పట్లో మృతుడి కుటుంబ సభ్యులు హోటల్ నిర్వాహకులకు పెద్దఎత్తున వాగ్వాదం జరిగింది.

నిరుద్యోగి బలవన్మరణం

రాప్తాడురూరల్: బీటెక్ పూర్తయి మూడేళ్లయినా ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన యోగేంద్రరెడ్డి శుక్రవారం సాయంత్రం అనంతపురం రూరల్ పరిధిలోని తాటిచెర్ల రైల్వేస్టేషన్ సోములదొడ్డి రైల్వే గేటు మధ్య ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

బేకరీలు, హోటళ్లపై విజిలెన్స్ దాడులు

అనంతపురం: నగరంలోని బేకరీలు, హోటళ్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మికంగా దాడులు చేశారు. స్వగృహ బేకరీ, స్వీట్స్, బెంగళూరు బేకరీ ,ప్యూర్ ఘీ స్వీట్స్, బెంగళూరు బేకరీ, వర్ష హోటళ్లను తనిఖీ చేశారు. వ్యాపార ప్రదేశాల్లో పరిశుభ్రంగా లేకపోవడం, తగిన నాణ్యతా లోపాలను గుర్తించి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహిస్తుండడంతో మున్సిపల్ యాక్ట్ ,1965 చట్ట ప్రకారం రూ.90 వేలు జరిమానా విధించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కే. శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ విజయలక్ష్మి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, శానిటరీ సెక్రెటరీ జి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆపన్నహస్తం

- వైద్యానికి కలెక్టర్ భరోసా



నారాయణ కుటుంబ సభ్యులు, చిన్నారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంత బాబు

సాక్షి ఎఫెక్ట్..

కంబదూరు: నిరుపేద కుటుంబానికి మానవతావాదులు ఆపన్నహస్తం అందించారు. తిమ్మాపురంలో రెండేళ్ల క్రితం తల్లి మరణించగా మూడు రోజుల క్రితం తండ్రి నారాయణ రోడ్డు ప్రమాదానికి గురై ఆయన వైద్యం కోసం చిన్నారులు పడుతున్న వేదనపై శనివారం సాక్షిలో 'మా నాన్నను కాపాడండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా డాక్టర్ వినోద్‌కుమార్ కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబుకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి పరిస్థితిని తెలియజేయాలని ఆదేశించారు. ఆర్డీఓ తహసీల్దార్ బాలకిషన్‌తో కలిసి గ్రామానికి వెళ్లి చిన్నారులను పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వైద్యం ఖర్చుల వివరాలు తెలుసుకుని వైద్యానికయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని కలెక్టర్ చెప్పిన మాటను తెలియజేశారు. అలాగే గ్రామస్తులు సుమారు రూ.2 లక్షల వరకు విరాళాలు సేకరించి నారాయణ వైద్యానికి పంపించారు. మరికొంత మంది మానవతావాదులు రూ. 30 వేలు వరకు ఫోన్ పే ద్వారా పంపించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.